# రావణజోస్యం

-డి. ఆర్. ఇంద్ర




అశోకవనంలో సాయం సమయంలో అద్దంలా ప్రతిఫలిస్తూన్న ఓ చిన్న కొలనులో ఓ సౌందర్యవతి కొద్దిగా వంగి తన ప్రతిబింబాన్ని చూసుకుంటూ అలంకరణ గావించుకుంటోంది. వత్తయిన నల్లని కురులను దువ్వి సిగచుడుతూ, ఎవరి కోసమో నిరీక్షిస్తూన్నట్టు వెనుదిరిగి చూస్తోంది.

కొలనులో విహరిస్తున్న హంసలు నవ్వాయి తెల్లగా.

''వన దేవతలా సహజ సౌందర్యవతివి! నీకు అలంకరణలు తెచ్చే కొత్త అందాలేవున్నాయ్?'' అన్నాయ్.

''ఈ కొత్త రకం సిగ నీకు చాలా బావుంది. రోజూ ఇలాగే వేసుకో'' అపురూపంగా ఆమెవంక చూస్తూ చెప్పాయి పక్కల నిలబడ్డ రెండు లేళ్ళు.

''ఒక్కసారి అలా ఆగు, కదలకు..'' అంటూ ఓ లేడి కళ్ళలోకి తన




ప్రతిబింబాన్ని చూస్తూ బొట్టు సరిచేసుకుంటూ చెప్పింది ఆ విశాల నేత్రి.

''రాడేం, అతను ఇంకా రాడేం? రోజూ ఈ పాటికి సగం వ్యాహ్యాళి పూర్తి చేసేవాళ్ళం!'' అనుకుంటూ మళ్ళీ వెనుదిరిగి చూసింది. ఓ ఆడ చెవుల పిల్లి పరిగెడుతూ వచ్చి ఆమె వడిలోకి దూకింది - ఇప్పుడు నన్ను పట్టుకోచూద్దాం అన్నట్టు తొంగి చూస్తూ. తరుముకొస్తూన్న పోతుపిల్లి సిగ్గుపడి ఆగి - ఇంక ఆ సింహాసనం దిగవా, అప్పుడు నీ పని పడతా అన్నట్టు బెదిరింపుగా చూస్తూ చెవులు విసురుగా ఆడిస్తూ వెనుదిరిగింది.

దూరాన్నుండి కోలాహలం వినిపించింది అట్టహాసంగా ఏ సార్వభౌమడో వస్తూన్నట్టు.

అర్ధనగ్నంగా వున్న అందగత్తెలు కొందరు తామరాలు విసురుతూండగా, ఓ సుందరి అలంకృత స్వర్ణచ్ఛత్రాన్ని పట్టగా, కొందరు చక్కని సంగీతం వినిపిస్తూండగా, మరికొందరు సుందరీమణులు బంగారు మద్యపాత్రలు పట్టుకుని కూడా రాగా, మదపు టేనుగులా తీవిగా, దర్పంగా వస్తున్నాడతను. ఆమెను సమీపించగానే అతన్ని వొదిలి ఆ పరివారం వెనుదిరిగింది.

'నీ కోసం ఎంత సేపటి నుండి నిరీక్షిస్తున్నానో రావణా! ఈరోజు ఇంత ఆలస్యమైందే?' అందామె.

''నా ఆలస్యానికి మన్నించు సీతా! ఏవో ముఖ్యమైన రాచ కార్యాల వల్ల ఆలస్యమైంది'' నొచ్చుకుంటూ చెప్పాడు.

సీత నవ్వింది. ''నీకు రాచకార్యాల తర్వాతేగా స్త్రీలు. స్త్రీల కోసమేగా ఆ రాచకార్యాలూ, రహస్య మంతనాలూ! ఎవరి భార్యనీసారి అపహరించి తేదలిచావ్?''

''నువ్వు అపూర్వ సౌందర్యవతివేగాక మాటకారివి కూడా. నీతో సంభాషించడం కత్తిమీద సాము. పద...'' అన్నాడు అడుగులు వేస్తూ.

అశోక వనంలోని చిన్న చిన్న కొండల మీద నుండి జాలువారే జలపాతాల వల్ల పూలు మడుగులు కట్టిన సరోవరాల మీద నుండి పరిమళ భరితంగా వీస్తూన్న చల్లగాలి ప్రియుడ్ని తాకే ప్రియురాలి స్పర్శలా మృదువుగా అనిర్వచనీయ ఆనందాన్ని స్తోంది.

రెండు నెమళ్ళు చెలికత్తెల్లా సీతని అనుసరిస్తున్నాయి. తమ స్నేహితురాలు సీతను అనుసరించవచ్చో లేదో అనే సందేహంతో లేళ్ళ జంట రావణుడ్ని చూసి ఆగిపోయింది. పచ్చిక బయలుపై జీరాడుతూన్న సీత కొంగుని పట్టుకుని వేలాడాలా వద్దా అని సందేహిస్తూ రెండు ఉడతలు కొమ్మలపై నుండే సీతవంక పలకరింపుగా చూసి నవ్వాయి. దూరంగా రావణుడి సుందర హర్మ్యాల స్వర్ణ గోపురాలు సాయంకాలపు నీరెండకి కళ్ళు చెదరిస్తున్నాయ్. సీత అశోకవనంలో ప్రవేశించి ఆరు నెలలు పైనే కావస్తోంది.

''సీతా! స్వర్గాధిపతి దేవేంద్రుడు సైతం ఈర్ష్య పడే సాటిలేని ఈ దివ్య అశోకవనంలో అపురూప సౌందర్యవతులైన దేవదానవ యక్షకిన్నెర కింపురుష నాగకామినులతో అనేక వందలసార్లు క్రీడిస్తూ విహరించాను. వారిదేం సౌందర్యమనుకున్నావ్? కొండలను సైతం పిండిగొట్టగలిగే ఈ రావణుడి హస్తాలకు సైతం లొంగని వజ్రసదృశమైన కఠినమైన వక్షాలూ, శత్రువుల పీచమణిచే నా రాతి గదకన్నా బలిష్టమైన తొడలూ ... ఏం అందగత్తెల్లే, ఏం దేహాల్లే! ఈ అశోకవనం వల్ల వారి అందం ఇనుమడించేది. కాని నువ్వు అడుగుపెట్టడం వల్ల ఈ అశోకవనపు శోభే నీ వల్ల అనేక రెట్లు పెరిగింది సీతా! ఇక్కడి కోయిలలు నీ గొంతు విని తమ గొంతులను శృతి చేసుకుంటున్నాయ్! నీ సౌందర్యానికి అబ్బురపడి నెమళ్ళు సిగ్గుతో పురులు విప్పడం మానేశాయ్! ఈ అశోక వనంలో నీతో విహరించడమంత గొప్ప ఆహ్లాదాన్ని ఇంతకు మునుపెరుగను సీతా!''

''ఏం కోతలు రావణా! ఈ మాటల్ని ఇప్పటికి అనేక వందల మంది అందగత్తెలతో అనేక వేల సార్లు అని వుంటావ్. అవునా? అందగత్తెలను లొంగదీసుకునేందుకు కాముకులైన మీ పురుషులు విసిరే ఈ పొగడ్తలు ఈ సీతముందు పని చెయ్యవు. ఈ సీత నీ పొగడ్తలకు లొంగే సాధారణ స్త్రీ కాదు రావణా.''

''నిన్ను ఓ సాధారణ సౌందర్యవతిగా భావించడం లేదు సీతా! లోకంలోని అందరు పాలకుల్లాగే నేనూ అతి కాముకుడనే. అసంఖ్యాకమైన అందగత్తెలను పట్టి చెరచిన వాడినే. నాలో చాలా దుర్గుణాలూ, నీచత్వమూ వున్నాయ్ - నీ భర్తలోనూ, చాలా మంది పురుషుల్లోనూ వున్నట్టే. కానీ అబద్ధాలాడే దుర్గుణం మాత్రం నాలో లేదు. నా మాట నమ్ము సీతా! నిన్ను పొగిడి వశం చేసుకోవాలనుకోవడం లేదు. చాలా మంది స్త్రీలు స్వర్ణాభరణాలకి, పట్టు చీరలకీ, పొగడ్తలకీ లొంగిపోతారు తాత్కాలికంగా అయినా తమ భర్తలను తలపుల్లోంచి సులువుగా చెరిపేసి. కానీ నువ్వు అటువంటి స్త్రీల కోవకు చెందవు. నా అంతులేని సిరిసంపదలూ, అధికారం, అపురూప అశోకవనం, పొగడ్తలూ నిన్నే మాత్రం ప్రలోభపెట్టలేవు. నా సామదాన భేద దండోపాయాలు నిన్ను చలింప చేయలేకపోయాయి. అందుకే నీవంటే నాకు గౌరవం. నీ విషయంలో నా సహజ దుష్ట పద్ధతులకి ఏనాడో స్వస్తి చెప్పాను గదా సీతా.

ఎంత మంది అందగత్తెలనో నిర్దాక్షిణ్యంగా చెరచిన నాకు ఎందుకో నిన్ను చూస్తే మాత్రం ఇష్టపూర్వకంగా నువ్వు అంగీకరిస్తే తప్ప నిన్ను బలవంతాన పొందాలనిపించలేదు. నిన్ను దౌర్జన్యంగా లొంగదీసుకోలేని బలహీనత ఏదో నన్నావరించింది. అందుక్కారణం నీ ముఖంలో ప్రతిఫలించే అమాయకత్వమో, సూటిదనమో, నీ నేత్రాల వర్చస్సో నేను చెప్పలేను. నాకు అర్థంకాని ప్రత్యేకత ఏదో నీలో వుంది. నా భార్యలకన్నా వందరెట్లు అందగత్తెవి! ఇష్టపడి అంగీకరించావా, నా పట్టపు రాణితో సహా నా భార్యలందరితో నీకూ ఊడిగం చేయిస్తాను. నువ్వు మనసు మార్చుకునే సుదినం కోసం ఎన్నాళ్ళైనా వేచివుంటాను సీతా.''


''నువ్వు రోజూ పాడే పాత పాటేగా ఇది రావణా. ఎప్పుడు ఏ సౌందర్యవతిని తీసుకు వచ్చినా ఈ పలుకులేగా ఆమెతో పలికేది. రేపు నా కన్నా గొప్ప అందగత్తె తారసపడితే ఆమెతో కూడా ఇలాగే - 'సీతతో నీకు ఊడిగం చేయిస్తా, ఒప్పుకో' అంటావ్! నీ భార్యల కన్నా వంద రెట్లు అందగత్తెనా? ఏం వాచాలత్వం రావణా! పరస్త్రీని అనుభవించే వరకూ

ఆమె తన భార్యకన్నా వందరెట్లు అందంగానే కని పిస్తుంది మీ పురుషనేత్రాలకి. లోకంలోని సౌందర్య వంతులంతా నీ కామవాంఛలు తీర్చడానికే పుట్టారను కుంటున్నావా? ఒప్పుకుంటే నీ సార్వభౌమత్వాన్ని నా పాదాల ముందు ధారపోస్తావా? ఇప్పటిదాకా ఎంతమంది అందగత్తెల పాదాల ముందు ఎన్నిసార్లు నీ సార్వభౌమత్వాన్ని ధారపోశావో! అయినా ఇంకా సార్వభౌమత్వం మిగిలేవుందా? ఆ మిగిలిన అల్ప సార్వభౌమత్వాన్ని ఇప్పుడు నాకు ధారపోస్తావా? స్త్రీ సౌందర్యం నీకు ఎంత చులకనై పోయింది! సౌంద ర్యాన్ని సార్వభౌమత్వంతో కొనగలననుకుంటు న్నావా? ప్రలోభాలకి అమ్ముడు పోయేది సౌంద ర్యమే కాదు. అయినా అంత మంది అందగత్తెలను అనుభవించినా నీకింకా తృప్తి లేదా రావణా?''

''తృప్తా? అంతులేని మోహవాంఛతో నిరం తరం జ్వలించే ఈ రావణుడికి తృప్తా? మహార ణ్యాలను దహించే భయంకరమైన కార్చిచ్చు సైతం ఈ రావణుడి నిరంతర మోహాగ్ని ముందు ఓ చిన్న తాటాకుమంట లాటిది. నా మోహాగ్నిని వందలాది అందగత్తెలూ కించత్తయినా ఆర్పలేకపోయారు. నా వాంఛని చల్లార్చే శక్తి నీకొక్కర్తికే వుందనిపించింది నిన్ను చూశాక. పలు-అందగత్తెలతో సాగించిన బలవంతపు శృంగారం మొహం మొత్తింది. నీలాంటి అపూర్వమైన స్త్రీతో ఇష్టపూర్వకంగా అనుభవించే శృంగారమే శృంగారమనిపిస్తోంది. నువ్వు తిరస్కరిం చిన కొద్దీ నీపై నా మోహం నిత్యం పెరుగుతూనే వుంది. అయినా నిన్ను బలాత్కరించను. ఈ అశోక వనంలోనే కాక నా అసంఖ్యాక రాచసౌధాలలో కూడా నువ్వు స్వేచ్ఛగా, నిర్భయంగా విహరించవొచ్చు సీతా.

... అన్నట్టు ఇది విన్నావా? ఈ మూర్ఖలోకం నా గురించి ఏమనుకుంటోందో! నా గూఢచారులు వార్తలు తీసుకొచ్చారు. నిన్ను ఈ అశోకవనంలో బంధించి వికృత రూపులైన రాక్షస స్త్రీ మూకలను విచ్చు ఖడ్గాలతో కాపలాపెట్టి భయపెడ్తూ, హింసి స్తూ వశం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నానని చెప్పు కుంటున్నారట!''

''విన్నాను రావణా! నా చెవినా పడ్డాయి ఆ పుకార్లు. అంతేకాదు. నేను ఇన్ని నెలలుగా అన్న పానా దులు మాని, వస్త్రాలు కూడా మార్చకుండా, స్నానం కూడా చెయ్యకుండా, మురికి ఓడుతూ, నా రాముణ్నే అహర్నిశలూ తల్చుకుంటూ శోకవనితనై కన్నీరు వరద కట్టేలా ఏడుస్తూ కూర్చున్నట్టు, ఓ గడ్డి పరకను అడ్డం పెట్టుకుని నీకు సమాధానాలి స్తున్నాననీ చెప్పుకుంటున్నారట! నాకు నవ్వొస్తోంది రావణా! వాస్తవాలను వక్రీకరిస్తూ లేనిపోని పుకార్లను పుట్టించడం కన్నా గొప్ప వినోదం ఈ లోకులకి మరొకటి లేదేమో... ఈ కొమ్మ కొంచెం వంచు, ఈ పుష్పం ఎంత మనోహరంగా వుందో!'' రావ ణుడు కొమ్మను వంచగా కొంచెం ఎగిరి అందుకున్న




ఓ అపురూప పరిమళ భరిత పుష్పాన్ని తుంచి సిగలో తురుముకుంది.

''ఇటువంటి రమణీయ పుష్పాన్ని ఎక్కడా చూడలేదు. ఓ రాచ కుటుంబంలో పుట్టి పెరిగి మరో రాచ కుటుంబానికి తరలి వెళ్ళిన దాన్ని. భోగ భాగ్యాలూ, ఉద్యానవనాలూ నాకు వింతేమీ కాదు. కానీ ఊహాతీతమైన శోభతో విలసిల్లే ఈ అశోక వనంలో సాటివచ్చే సుందరోద్యానవనం మా మిధి లలో గానీ, అయోధ్యలో గానీ లేదు. ఈ అపురూప వనం చుట్టూ అఖండ సముద్రంపై నుండి గంధ ర్వులు గానం చేస్తూన్నట్టు శబ్దిస్తూ వీచేగాలీ, నీ ఆజ్ఞ ఒప్పున నృత్యం చేస్తూన్నట్టు చలించే మేఘాలు, మైమరపించే ఈ సుందర ప్రకృతి శోభా నన్నెంత గానో ఆకట్టుకున్నాయి రావణా. బలదర్పంతో స్త్రీలను చెరిచే వాడివైనా నీ సౌందర్యారాధనా దృష్టిని అభినందించకుండా వుండలేక పోతున్నాను. ఈ సౌందర్య దృష్టి నా రాముడిలో మృగ్యం!''

''ఆ మాట వేరే చెప్పాలా సీతా? గొప్ప సౌందర్యవతి అయిన నా చెల్లెలు శూర్పణఖముక్కూ-చెవులూ ఖండించి వికృత రూపిణిని చేసి తన సౌందర్య ద్వేషాన్ని చాటుకున్నాడుకదా నీ రాముడు. సౌందర్యం పట్ల ఎంత హేయత హృదయంలో లేక పోతే కోరివచ్చిన అందగత్తెను అంత క్రూరంగా వికా రిని చేయగలడు.''

''అవును రావణా. నా ఎదుటే రాముడి ఆజ్ఞపై నా మరిది లక్ష్మణుడు శూర్పణఖను క్రూరంగా ఒడిసిపట్టి పడదోసి నిర్దయగా, పాశవికంగా తన ఛురికతో ఆమె ముక్కూ, చెవులూ ఖండించడంతో నాకు భయంతో, జుగుప్సతో వళ్ళు గగుర్పొడిచి మూర్ఛ వచ్చినంత పనైంది! రక్తధారలు ఓడుతూ శూర్పణఖ చేసిన రోదన నన్నింకా బాధిస్తూనే వుంది. శూర్పణఖపై నా భర్తా, మరిదీ చేసిన అకృ త్యాన్ని మొత్తం స్త్రీ జాతిపై చేసిన అకృత్యంగానే భావిస్తాను. లోకంలో ఎక్కడైనా స్త్రీలపై జరిగే దౌర్జ న్యాలను అరికట్టవలసిన రాచపురుషులేవా స్వయంగా తామే ఓ అబలపై అకృత్యాన్ని చేస్తూన్న ఈ రామ లక్ష్మణులు అనిపించింది!

శూర్పణఖ చేసిన నేరం ఏమిటి? రాముణ్ని మోహించి సమీపించడమేగా. దానిని రామలక్ష్మ ణులు అపహాస్యం చేయాలా? మోహం పురుషులకే గానీ స్త్రీలకి ఉండకూడదా? రాముడు శూర్పణఖ కోర్కెను తీర్చివుంటే ఈర్ష్యపడి వుండేదాన్ని కాను. రాముడికి నేనొక్కర్తినే స్త్రీని కాను. నా తండ్రి జన కుడికీ, మామ దశరథుడికీ, నా మరుదులకీ, లోకం లో అందరు రాచపురుషులకీ ఉన్నట్టే రాముడికీ అయోధ్యలో అంతఃపురంలో వందలాది భోగస్త్రీ లున్నారు. వారిలో నేను ప్రథమ రాణీహోదా కలిగిన స్త్రీని మాత్రమే. రాముడి వందలాది అంతఃపుర స్త్రీలలో ఒకర్తినై వుండి, ఇతర స్త్రీలతో రాముడు పొందే సౌఖ్యానికి నేను ఈర్ష్యపడి ఏమిలాభం? రాచ కుటుంబంలో ఆడదానిగా పుట్టిన పాపానికి ఏ స్త్రీ ఈ క్షోభ నుండి తప్పించుకోగలదు? తన భర్త ఇతర స్త్రీలతో బాహాటంగా శయనించడం చూసి కూడా, ఎంత పట్టపు రాణి అయినా సరే ఓ వేడి నిట్టూర్పు విడిచి తన శారీరక, మానసిక వాంఛల్నీ, వ్యధనీ సమాధి చేసుకోవాల్సిందేగా - మీ పురుషులు సృష్టిం చిన పాతివ్రత్య ధర్మాల పేరిట! అది రాముడి అంతః పురమైనా, రావణుడి అంతఃపురమైనా అంతేగా. దౌర్జన్యంగా అందగత్తెలను చెరబట్టి అంతఃపుర చెర శాలల్లో బంధించి అనుభవించే రాచపురుషులకు సైతం స్త్రీ తనంతట తాను కోరివస్తే ఆ పురుషుడు రాముడైనా, మరో రమావల్లభుడైనా ఆ పురుషుడికి ఆ స్త్రీపట్ల ఎంత చులకన! ఎంత నిరాదరణ! ఎంత హేళన!

సాటి స్త్రీ అయిన శూర్పణఖపై దౌర్జన్యం చేసింది నా భర్తా, మరిదే అయినప్పటికీ వారిని నేను సమర్థించలేను, క్షమించలేను. కానీ భర్తే స్త్రీకి దైవ మనీ, అతనెటువంటి వాడైనా, అతని మాటలకూ, వికృత చేష్టలకూ ఎదురు చెప్పకూడదనే పాతివ్రత్య

ధర్మాలను బాలికగా వున్నప్పటి నుండీ పెద్దలూ, స్త్రీలూ, రుషులూ, బ్రాహ్మణులూ ఊదరగొట్టి బోధించడం వల్ల బురదగుంటలో దొర్లి పంది బురదను అంటించుకున్నట్టు పాతివ్రత్య ధర్మాల బురదను ఆత్మకు దట్టంగా పట్టించుకున్నాను కాబట్టి మనసులో మదనపడటమే తప్ప రామలక్ష్మణుల అత్యాచారాన్ని నిరశించలేకపోయాను. కానీ ఈ అశోక వనంలో అడుగు పెట్టాక జరిగిన సంఘటన వల్ల నా పాతివ్రత్య ధర్మాల దళసరి బురద పొరలన్నీ ఎండి పొలుసులుగా రాలిపోతున్నాయ్ ఒకటొకటిగా. ఇలా మనసువిప్పి ఇంతకు మునుపు ఎవరితోనూ మాట్లాడి ఎరగను రావణా. ఈ అశోకవనం స్త్రీ స్వేచ్ఛనూ, ఆలోచనలనూ హరించేసే నా పుట్టిల్లో, అత్తిల్లో కాదు కాబట్టేమో ఇక్కడ స్వేచ్ఛగా ఆలోచించగలుగుతున్నాను.

శూర్పణఖను కురూపిని చేసి హింసించమని తమ్ముడ్ని ఆజ్ఞాపించిన ఈ రాముడ్నే అయోధ్యలో రుషులూ, బ్రాహ్మణులూ దండిగా సంభావనల మూటలు మోసుకెడుతూ - 'పరస్త్రీని తల్లిగా భావించే శ్రీరామచంద్రుడు! సుగుణాల పుట్ట!' అని కీర్తించే వాళ్ళు! లోకం తనని గమనించడం లేదనుకోగానే, ధర్మపరులుగా కీర్తింపబడేవాళ్ళ అంతరంగాల్లోని నిజస్వరూపాలు ఎంత వికృతంగా బయట పడతాయో చూసి విస్తుపోయాను. అందుకు రాముడ్ని నేను నిందించడం లేదు. లోకంలో పరస్త్రీలను తల్లిగా భావించే పురుషులెవరూ ఉండరనీ, స్త్రీలను హింసించడంలో, బలాత్కరించడంలో ప్రతి పురుషుడిలోనూ కొద్దో గొప్పో రాముడి అంశా, రావణుడి అంశా వుంటాయనే కఠోర సత్యాలను జీవితమే నాకు నేర్పింది రావణా.

శూర్పణఖపై నా రాముడు చేసిన అకృత్యానికి ప్రతీకారంగా నువ్వు నన్ను బలిపశువుని చేసి దౌర్జన్యంగా ఎత్తుకొచ్చినందుకు మొదట నీపై తీవ్ర ఆగ్రహంతో, దుఃఖంతో విపరీతంగా కంపించిపోయాను. నన్ను తాకినంతనే నిలువునా నిన్ను భస్మం చేయలేకపోయిన నా పాతివ్రత్య ధర్మాన్ని చూసి నిర్ఘాంతపోయాను! సిగ్గుపడ్డాను. మా చుట్టూ చేరే రుషులూ, బ్రాహ్మణులూ నిత్యం పొగుడుతున్నట్ట నేను సావిత్రి, అనసూయ, దమయంతి వంటి గొప్ప పతివ్రతని కానా అని తీవ్రంగా మదనపడ్డాను! నువ్వు నన్ను బెదిరించడమే తప్ప చెరచే ప్రయత్నం చెయ్యకపోవడంతో నా మనసు కుదుటపడి క్రమేపీ ఆలోచనలు చోటు చేసుకోసాగాయి. ఆలోచించిన కొద్దీ పాతివ్రత్య ధర్మం స్త్రీలను రక్షిస్తుందని పీచుగెడ్డాల రుషులూ, బ్రాహ్మణులూ, ముదివగ్గులైన అమ్మమ్మలూ చెప్పే కబుర్లన్నీ వొట్టి కట్టు కథలని రూఢి అయింది నాకు.

నీ అలవాటు ప్రకారమే నన్నూ చెరిస్తే ఏమై వుండేదాన్ని అని ఆలోచించాను. నువ్వు చెరిచిన వేలాది నిర్భాగ్య స్త్రీలలో ఒకర్తినై ఉండేదాన్ని! లోకంలో ఇంతవరకూ నీలాంటి కాముకుల పశుతృష్ణకి ఎన్ని లక్షల మంది స్త్రీలు చెరచబడి వుంటారో! ఆకాశంలో నక్షత్రాలనైనా లెక్కపెట్టవచ్చేమో కానీ ఆ నిర్భాగ్య స్త్రీల సంఖ్యని ఎవరు లెక్కపెట్టగలరు? నీ చేతిలో చెరచబడ్డ స్త్రీలను వారు పాటించిన పాతివ్రత్య ధర్మాల మహిమలూ, భర్తల పాదాలకూ, రుషులకూ, బ్రాహ్మణులకూ, ముక్కోటి దేవతలకూ చేసిన పూజలూ, నోములూ, వ్రతాలూ, దానాలూ ఏం కాపాడాయ్? పాతివ్రత్య మహిమలు గొప్ప అబద్ధాలని అర్థమై, నిస్సహాయులై అవమాన భారంతో, ఆక్రోశంతో, దుఃఖంతో శోషవచ్చి పడిపోయిన ఆ నికృష్ట పతివ్రతల్ని ఏ దైవం రక్షించింది? దేవుడంటూ వుంటే ఆ దేవుడు కూడా నీలా శవసంభోగాసక్తుడై వుండాలి. లేకపోతే నీలాటి వారిని ఎవరు సృష్టించారు? ఆ నిర్భాగ్య పతివ్రతల్లో ఒకర్తినైతే ఆకాశం కూలిపోతుందా? సముద్రాలు పొంగుతాయా? భూమి విచ్చిపోతుందా? ఏమీ అవదు! సీత శీలాపహరణతో లోకం దగ్ధమైపోదు! కర్మసాక్షి అని కీర్తించబడే సూర్యుడు ఏమీ చూడనట్టు మామూలుగానే ఉదయిస్తాడు! సీతకష్టమూ, మానావమానాలు సీతవేగానీ లోకానివి కావు. ఈ లోకానికి ఎవరికష్ట నష్టాలతోనూ పనిలేదు. స్త్రీ జీవితం - అందునా అందగత్తె జీవితం ఎంత భయంకరం! ... ఓహో రావణా! ఈ స్వేచ్ఛా పూరిత అశోక వనపు గాలి నాచే ఎలా మాట్లాడిస్తోంది! నేను ... నేను ... సీతనేనా అని నాకే ఆశ్చర్యం వేస్తోంది! నా ఆలోచనలు వింతగా ఆనందంగా వుంటున్నాయ్! అంతఃపురాల బయటా, గృహ నిర్బంధాల వెలుపలా స్త్రీ ఆలోచనలు ఎంత బాగా వికసిస్తాయ్! ఉషోదయాన సూర్యకిరణ స్పర్శకి మొగ్గలు వికసించినంత సహజంగా!''

> **''సీతా! నీలో రోజు రోజుకీ ఎంత మార్పు! శోకమూర్తిలా అశోకవనంలో అడుగుపెట్టిన నాటి ఆ సీతా - రావణుడితో నిర్భయంగా మాట్లాడే ఈ సీతా ఒకరేనా అనిపిస్తోంది!''**

''సీతా! నీలో రోజు రోజుకీ ఎంత మార్పు! శోకమూర్తిలా అశోకవనంలో అడుగుపెట్టిన నాటి ఆ సీతా - రావణుడితో నిర్భయంగా మాట్లాడే ఈ సీతా ఒకరేనా అనిపిస్తోంది!''

''ఇంకా మార్పు వస్తుంది రావణా! ఇంత కాలం గానుగ ఎద్దుకళ్ళకి నల్లగంతలు కట్టి బరువైన కాడిమోసి గుండ్రంగా తిప్పినట్టు - మా కళ్ళకి పాతివ్రత్య ధర్మాల నల్లగుడ్డలు బిగించి కట్టి ఈ లోకపు నిజస్వరూపాన్ని అర్థం చేసుకోకుండా చేశారు కదా మీ పురుషులు. ఒక్కసారి ఆ నల్లగంతలు విప్పుకోగలిగామా - మా దేహాల మీద నుండీ, ఆత్మల మీద నుండి తొక్కుకుంటూ పూలబాటలా నడిచే మీ జీవిత సుఖాల రథం కుప్పకూలి ముక్కచెక్కలవక తప్పదు. పాతివ్రత్య మహిమలూ, పుణ్యలోకాలూ, దైవం అన్నీ మీరు కల్పించిన గొప్ప కట్టు కథలనే పరమసత్యం తెలిశాకా కూడా ఇంకా పాత సీతలాగే శోకిస్తూనే వుంటానా? కానీ ఈ ఆరు నెలలుగా ఎంత అంతర్మథనం అనుభవించాను! పరమ సత్యాలని నమ్మిన మహిమలన్నీ తేనెపూసిన విషగుళికలు మాత్రమే అని రుజువవుతోంటే నమ్మలేక ఎంత విలవిల్లాడాను!''

''సీతా! భర్తృవియోగం నిన్ను బాధించలేదా? రాముడి వద్దకు పంపమని నన్ను అర్థించవు!''

''నేను అర్థిస్తే ఎత్తుకొచ్చావా - అర్థిస్తే తిరిగి పంపడానికి? రాముడి వద్దకు పంపమని అర్థించి నన్ను నేను చులకన చేసుకోను. జరిగేది జరగనీ.

ఇక భర్త వియోగబాధ అంటావా? భర్త వియోగం వల్ల నా మనసు బాధపడుతోందా, బాధపడేంత గాఢమైన ప్రేమ అసలు మా ఇద్దరి మధ్యా వుందా అని తీరుబడిగా ఇప్పుడు ఆలోచిస్తున్నాను రావణా. ఈ మాట లోకానికి విచిత్రంగా అనిపించవొచ్చు కూడా. భర్త వియోగం భార్యకు భరింపరానిదిగా లోకం భావిస్తుంది.

నా వివాహం కోసం జరిగిన శివధనుర్భంగ పోటీలో రాముడు గెల్చి నా జీవిత యజమాని అయ్యాడు. ఆ పోటీ నియమాల ప్రకారమే మా వివాహం జరిగింది తప్ప ప్రేమను బట్టి కాదుగా. ఆ బల ప్రదర్శన పోటీని సీతా స్వయం వరమని రుషులూ, నా తండ్రీ ప్రకటించడం ఒక మోసం. ఆ విల్లు విరిచిన వాడు కురూపైనా, కుష్టువాడైనా, క్రూరుడైనా, నా కిష్టమైనా, లేకపోయినా, అతని మెడలో వరమాలవేసి, కొనుక్కున్న యజమాని వెంట పశువులా వెళ్ళవలసిన దాన్ని, నచ్చిన వాడిని స్వయంగా వరించడానికి స్వేచ్ఛ లేనిదాన్ని స్వయం వరమనడం ఎంతహేయం! ఆ పోటీలో నువ్వే పాల్గొని గెలిచివుంటే నీ భార్యనై వుండేదాన్ని! బలప్రదర్శన నియమాల ప్రకారం జరిగిన వివాహంలో ప్రేమ ప్రసక్తి ఎక్కడుంది? వివాహమయ్యాకా ప్రేమించడమంటావా? ప్రేమకి అర్థం స్త్రీ పురుషులకి వేర్వేరుగా వుంటుంది. వందలాది సుందరాంగులచే పరివేష్టితులై వుండే రాచపురుషులకి ఒక్క భార్యమీదే ప్రేమ ఎలా వుంటుంది? రాచపురుషుల దేహావసరాలకి ఒక్క స్త్రీయే కావాలని ఏముంది? అందుబాటులో వున్న ఏ ఆడదాన్నైనా తాత్కాలికంగా పురుషులు గొప్పగా ప్రేమించగలరు గదా! వనవాసంలో అంతఃపుర భోగస్త్రీలకు దూరమైన రాముడికి పాతివ్రత్య ధర్మాన్ని అనుసరించి వెంట వచ్చిన ఈ సీత తప్ప కామ నివృత్తికి నేరెవరున్నారు. దేహావసరాల నిమిత్తం భార్యాభర్తలు కాస్త చనువుగా వుంటాన్నే ప్రేమ అనుకుంటే రాముడికి నాపై ప్రేమ ఉన్నట్టేనేమో.

**(సశేషం)**